

న్యూ ఇయర్ వేడుకలు
ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ ఓ ప్రకటనలో కోరారు. వేడుకలకు ఎవరైనా సినీ, సెలబ్రిటీలు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫాంహౌస్‌లలో వేడుకలు నిర్వహించినా, మద్యం, డ్రగ్స్ తీసుకొచ్చినా, ఇతరులకు ఇబ్బంది కలిగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మహాసభలకు హాజరైన గవర్నర్, ప్రముఖుల వేషధారణలో విద్యార్థులు

రాష్ట్ర, జాతీయ శక్తి యువత

దేశ అభివృద్ధిలో 'ఏబీవీపీ' కార్యకర్తల పాత్ర కీలకం : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అట్టహాసంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

హాజరైన అఖిల భారత సంఘటన కార్యదర్శి ఆశిష్ చౌహాన్, ప్రముఖులు



ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న గవర్నర్

సిద్దిపేట క్రైం, డిసెంబరు 23 : అఖిల భారత విద్యార్థి పరిషత్ వ్యక్తి వికాసం కోసం కాకుండా జాతీయ వికాసం కోసం పనిచేస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్ర, జాతీయ శక్తి యువతనే అని ఆయన కొనియాడారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం అఖిల భారత విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ అభివృద్ధిలో ఏబీవీపీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. అందరూ భరతమాత సేవలో తరించాలన్నారు. ఏబీవీపీ నుంచి ఎదిగిన ఎంతోమంది గొప్ప లీడర్లుగా ఉన్నారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ముందుగా ఈ మహాసభల్లో ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా జనారెడ్డి, కార్యదర్శిగా కంచర్ల రాంబాబును ఎన్నుకున్నారు. ఏబీవీపీ ప్రస్థానం భిన్నమైనదని ఏబీవీపీ అఖిల భారత సంఘటన కార్యదర్శి ఆశిష్ చౌహాన్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, గుజరాత్‌తో పాటు, పలు రాష్ట్రాల్లో మహాసభలు నిర్వహించామని ఎన్నో విద్యారంగ సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. ఏబీవీపీ సామాజిక సమస్యలపై పోరాటం చేస్తుందని

మిగతా 7వ పేజీలో...

గవర్నర్‌కు ఘన స్వాగతం

సిద్దిపేట జిల్లా ఐడీవోసీకి సోమవారం ఉదయం 10:57నిమిషాలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేరుకున్నారు. కలెక్టర్ మనుచౌదరి, ఇన్‌చార్జి సీపీ అకిల్ మహాజన్ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కలెక్టరేట్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐడీవోసీ మొదటి అంతస్తులోని స్టేట్‌చాంబర్‌లో తేనేటి విందు ను స్వీకరించి కలెక్టర్‌తో ముచ్చటించారు. 11:34 నిమిషాలకు ఏబీవీపీ రాష్ట్ర మహాసభ కార్యస్థలికి బయలుదేరారు.

రైతు దినోత్సవంలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లిలో సోమవారం నిర్వహించిన రైతు దినోత్సవం కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా ప్రతీ ఏటా జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు వివరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుత తరుణంలో రైతులను, వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్, అదనపు చంద్రశేఖర్, డీఏవో శివప్రసాద్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మంజీరా సమాఖ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ రైతు దినోత్సవంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఏవో శివప్రసాద్, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి

కట్టు కాల్వలు మాయం

- ఆరు కాల్వలకు ఐదు పూడ్చివేత
- నీళ్లన్నీ పొలాల్లోనే
- పట్టించుకోని అధికారులు

కంది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కందిలోని కిసాన్‌సాగర్ చెరువు కింద ఉన్న ఆరు కట్టుకాల్వల్లో ఐదు మాయమయ్యాయి. దీంతో, వర్షం కురిస్తే వరద నీరు రోడ్లపై చేరుతున్నది. కిసాన్‌సాగర్ చెరువు కింద 100 ఎకరాల ఆయకట్టు ఉండగా సగం భూమిలో ప్రస్తుతం సగం భూమిలో వెంచర్లు, దాబాలు వెలిశాయి. ఇందుకోసం ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కై కట్టుకాల్వలను ఒక్కొక్కటిగా మూసివేయించారు. దీంతో ఆగ్రహించిన రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. కట్టుకాల్వలు లేక వర్షాకాలంలో వరద నీరు పొలంలోనే నిలిచిపోవడంతో తన ఆరెకరాల పొలం సాగు చేయకుండా వదిలేశానని ఓ రైతు వాపోయారు. ఈ విషయంపై తాము పలుమార్లు నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. నేషనల్ హైవే వెడల్పు పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా డ్రైనేజీల నిర్మాణంలో కూడా కొన్ని కట్టు కాల్వలు ధ్వంసమవుతున్నట్లు రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

పొలం నిండా నీళ్లు

-బండి వీరారెడ్డి, రైతు, కంది

కందిలోని కిసాన్‌సాగర్ చెరువుకింద ఉన్న ఐదు కట్టు కాల్వలను మూసివేయడంతో పొలాల్లో నీళ్లు నిలిచిపోతున్నాయి. పంటలు పండించుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే వరద నీళ్లన్నీ పొలాల్లో, రోడ్లపై నిలుస్తున్నాయి.

కాల్వలను తిరిగి తవ్విస్తాం

-మజార్, నీటిపారుదలశాఖ ఏఈ

కంది కిసాన్‌సాగర్ చెరువు కట్టు కాల్వలను తిరిగి తవ్విస్తాం. ఈ విషయంపై నేషనల్ హైవే అధికారులతో మాట్లాడాం. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే సర్వీసు రోడ్డు వేసేటప్పుడు కట్టుకాల్వలు తిరిగి నిర్మిస్తామని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సత్వరమే కాల్వలు తవ్విస్తాం.



కందిలో రోడ్డు విస్తరణ పనుల్లో మూసివేసిన కిసాన్‌సాగర్ చెరువు కట్టు కాల్వను చూపుతున్న రైతులు

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ.18 లక్షల విలువైన 24 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ రూపేష్

7



పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

తగ్గిన దిగుబడి..
పెరిగిన పెట్టుబడి

- ధర లేక ఉల్లి రైతుల సతమతం
- క్వింటాలుకు రూ.3 వేల వరకు మాత్రమే..

7



హద్దురాళ్ల ఏర్పాటుపై ఆగ్రహం

ఐడీఎస్ఎంటీ వద్ద ఉద్రిక్తత

8





మెదక్ చర్చి



చర్చి వద్ద రంగులరాట్నం

మహాలయం ముస్తాబు

క్రిస్మస్ వేడుకలకు సిద్ధమవుతున్న మెదక్ సీఎస్ఐ

చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు

వేడుకల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిటీ, అధికారులు

మెదక్ కల్చరల్, డిసెంబరు 23: ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మెదక్ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ శోభ సంతరించుకుంది. చర్చి నిర్మించి ఈ డిసెంబరు 25 నాటికి వందేండ్లు నిండిన సందర్భంగా అత్యంత వైభవంగా వేడుకలను జరిపేందుకు సిఎస్ఐ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చిని విద్యుద్దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తున్నారు. చర్చి చుట్టూ మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాలను అమరుస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వంద సంవత్సరాల క్రితం మెదక్ చర్చిని ఇంగ్లాండ్‌కు చెందిన మత బోధకుడు పాస్నెట్ నిర్మించారు. పది సంవత్సరాల పాటు నిర్మాణాన్ని నిర్విరామంగా కొనసాగించారు. 174 అడుగుల ఎత్తున నిర్మించిన చర్చి టవర్లు పది కిలోమీటర్ల దూరం వరకు కనిపిస్తాయి. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడానికి మెదక్ జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈసారి క్రిస్మస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి చర్చిని సందర్శించనున్నారు. సీఎం రాక సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కృతజ్ఞత, ఆరాదన సభ

మెదక్ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): మెదక్ చర్చి వందేళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సోమవారం చర్చి నిర్మాత పాస్నెట్‌కు కృతజ్ఞత ఆరాధన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన రక్తసంబధీకులతో పాటు గతంలో పని చేసిన బిషప్‌లతో పాటు, వివిధ డయాలసిస్‌లకు చెందిన సువార్తీకులు హాజరయ్యారు.

కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్టులు లేవు

క్రిస్మస్‌ను సంబరాలను అధికారికంగా జరిపిన ఘనత కేసీఆర్‌దే

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పోలీసులను పంపుతున్నారు

అసెంబ్లీ సాక్షిగా ఆరు గ్యారెంటీలపై చేతులెత్తేశారు

మాజీమంత్రి హరీశ్ రావు

మెదక్/మెదక్ అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా ఏటా ప్రభుత్వం క్రైస్తవులకు అందించే కానుకలను ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మెదక్ చర్చిని సందర్శించారు. చర్చి కమిటీ ప్రతినిధులు ఆయనను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ఇన్‌చార్జి బిషప్ ఆశీర్వచనం అందించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో క్రిస్టమస్ పండగను అధికారికంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని గుర్తు చేశారు. క్రిస్మస్ మర్నాడు జరిపే బాక్సింగ్-డేను సెలవుదినంగా ప్రకటించిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని అన్నారు. సీఎం రేవంత్ పాలనలో బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాలు బంద్ అయ్యాయని వాపోయారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు రోడ్ల మీద ధర్నాలు చేస్తున్నారని, మాట ఇచ్చిన ప్రకారం ఆర్నెళ్లకో, ఏడాదికో చేస్తా అని ఓదార్చకుండా అడిగిన వారిని అదరగొడుతున్నారని ఈ ప్రభుత్వంపై మండిపడ్డారు. అసెంబ్లీలో అడిగిన దానికి సమాధానం ఇవ్వకుండా మైక్ ఇవ్వవద్దని స్పీకర్‌కు సీఎం రేవంత్ సూచిస్తున్నారని మండిపడ్డారు. అడ్డగోలుగా అబద్ధాలు చెబుతూ సభను అపవిత్రంగా మార్చారని సీఎంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలసీలను ప్రశ్నిస్తే పోలీసులను ఇంటికి పంపడం ఏం పద్ధతని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు ఎంతసేపు ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు బనాయించడం, ప్రతిపక్షనేతపై నిఘా పెట్టడం పైనే శ్రద్ధ చూపుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఏడాది శాంతిభద్రతలపై ఇచ్చిన నివేదికలో రేవంత్ పాలనలో ఈ ఏడు 41 శాతం క్రైమ్ రేట్ పెరిగిందని పేర్కొన్నట్లు తెలిపారు. మీ పాలనకు ఈ నివేదికే తార్కాణంగా నిలుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఏడాదిలో 9 మతకలహాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి గాడిద గుడ్డిచ్చాడని మాజీ మంత్రి హరీష్ ధ్వజమెత్తారు. బడా కాంట్రాక్టర్ల వద్ద పర్సెంటేజీలు తీసుకుని బిల్లులు ఇచ్చాని ఆక్షేపించారు. బీఆర్ఎస్ హయాంలో 4.17 లక్షల కోట్లు అప్పు చేసి సమర్థవంతంగా పాలన సాగినట్లు వివరించారు. రైతు రుణమాఫీపై ఈ నెల 25న రాష్ట్రంలో ఏ ఊరికైనా వెళ్లడానికి తాను సిద్ధమేనని.. నీవు ఓకేనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఏడుపాయల అమ్మవారిపైన ఒట్టుపెట్టి మాట తప్పావని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



హరీశ్‌రావును ఆశీర్వదిస్తున్న మతపెద్దలు

మున్సిపాలిటీగా మార్చొద్దు

- రైతుల ధర్నా.. స్తంభించిన ట్రాఫిక్
- వ్యవసాయ ప్రాంతాన్ని రాజకీయాల కోసమే మున్సిపాలిటీగా ఏర్పాటు

7



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రజావాణికి 85 దరఖాస్తులు

- వినతులను సత్వరమే పరిష్కరించాలి
- మెదక్ జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు

మెదక్ అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 85 అర్జీలు రాగా.. ఇందులో భూ సంబంధిత 35, ఇండ్లు 12, పింఛన్ 3, ఇతర సమస్యలకు సంబంధించి 35 దరఖాస్తులు ఉన్నాయి. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో 68 అర్జీలు

సంగారెడ్డి అర్బన్ (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, అర్జీలు, ప్రజా వినతులను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌వో పద్మజరాణితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన 68 దరఖాస్తులను అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో క్షేత్ర స్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని ఆదేశించారు.

గీతం పాలక మండలి సభ్యులుగా ఇద్దరు మహిళా ప్రముఖులు

స్వాగతం పలికిన గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గీతం పాలక మండలి (గవర్నింగ్ బాడీ) సభ్యులుగా ఇద్దరు ప్రముఖ మహిళలను నియమించినట్లు సోమవారం యూనివర్సిటీ విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కె.విజయలక్ష్మి, ఆర్థిక సేవల నిపుణురాలు, పద్మజ చుండూరు తమ సేవలను అందించనున్నారు. గవర్నింగ్ బాడీ సమావేశంలో కొత్త సభ్యులకు గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ ఘనస్వాగతం పలికారు.

అన్నదాతలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

రాష్ట్ర రైతు సమైక్య సంఘాల మాజీ అధ్యక్షుడు మంద బలరాంరెడ్డి



సన్మానం అందుకున్న అధికారులు, రైతులు

గుమ్మడిదల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కష్టాలు ఎన్ని వచ్చిన ఓర్చుకొని తన కుటుంబం గురించి కాకుండా ప్రజలకు అన్నం పెట్టాలని ఆలోచనతో రైతులు నిత్యం తపిస్తుంటారని, దేశానికి అన్నం పెట్టే అలాంటి అన్నదాతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని రాష్ట్ర రైతు సమైక్య సంఘాల మాజీ అధ్యక్షుడు మంద బలరాంరెడ్డి పేర్కొన్నారు. గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు లేనిది రాజ్యం లేదని అలాంటి రైతుకు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు అందించి, ప్రత్యేక పతకాలతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులందరూ సంఘటితంగా ఉంటేనే ప్రభుత్వ పతకాలను సాధించుకునే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఏటా గుమ్మడిదల మండలంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది అన్నారు. రైతు దినోత్సవం రైతులకు సంపూర్ణ సహకారం అందించిన అధికారులను, ఆదర్శ రైతులను సన్మానించుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పుట్ట నర్సింగ్, మాజీ సర్పంచు తులసీదాస్, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ గంగాభవానీ, ఏవో శ్రీనివాస్రావు, హెచ్‌వో సంగీత, రైతులు పాల్గొన్నారు.

'షీ'రోస్‌గా మెరిసిన కేంద్రీయ పాఠశాల విద్యార్థినులు



వేషధారణలో విద్యార్థినులు

కంది, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : 'ధీర వనితలు -స్ఫూర్తి కాంతులు' అనే నినాదంతో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కంది మండల పరిధిలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉన్న కేంద్రీయ పాఠశాలకు చెందిన 8 మంది షీరోస్ అలంకరణలో ఆకట్టుకున్నారు. విద్యార్థిని నందిని మేజర్ జయసుధగా, వరలక్ష్మి పీటీఉషగా, ప్రవళిక స్మితా సబర్వాల్‌గా, అంజలి సింగర్ మంగ్లీగా, గీత సావిత్రిబాయి పూలేగా, సాత్విక కిరణ్ బేడీగా, స్రవంతి వాణిమూర్తిగా, ఆసియాబేగం ముంతాజ్ ఖాజి వేషధారణల్లో అభినయించారు.

రాష్ట్ర, జాతీయ శక్తి యువత

5వ పేజీ తరువాయి

తెలియజేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి మాట్లాడుతూ 1949లో కొద్దిమందితో ప్రారంభమైన ఏబీవీపీ ప్రస్తుతం 50లక్షల మంది సభ్యత్వంతో ప్రపంచంలోనే అతి పెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా రూపొందిందని తెలిపారు. 75ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందన్నారు. లాల్‌చౌక్‌పై ఏబీవీపీ జాతీయ జెండాను ఎగురవేసిందన్నారు. రాబోయే రోజుల్లో ఏబీవీపీని మరింత విస్తృతం చేస్తామని తెలియజేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి సమస్య ఉన్న చోటే ఏబీవీపీ ఉంటుందని అన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని చేసిన ఉద్యమ ఫలితమే ఫీజురీయింబర్స్‌మెంట్ అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ మహాసభలకు రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు, ఏబీవీపీ ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మహాసభల స్వాగత సమితి చైర్మన్ అశోక్, ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి కల్యాణి, ఏబీవీపీ రాష్ట్ర మహాసభల కన్వీనర్ చంద్రోజు శ్రీనివాస్ ఇతరులు పాల్గొన్నారు.



ఏబీవీపీ రాష్ట్ర మహాసభలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

భార్యాభర్తల మధ్య గొడవ..
భర్త ఆత్మహత్య


భాస్కర్(ఫైల్)

దౌల్తాబాద్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య గొడవతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన దౌల్తాబాద్ మండల పరిధిలో చోటు చేసుకున్నది. దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ముత్యంపేట గ్రామానికి చెందిన తొడంగి భాస్కర్ (27) మహబుబ్‌నగర్ జిల్లాకు చెందిన విజయలక్ష్మి ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భాస్కర్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భాస్కర్ ఆయన భార్య విజయలక్ష్మి మధ్య తరుచూ గొడవలు చోటుచేసుకునేవి. ఆదివారం ఉదయం 7 గంటలకు భాస్కర్ తన భార్య విజయలక్ష్మితో సిద్దిపేటకు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. 8:30 గంటలకు భాస్కర్ తన ఫోన్ వాట్సాప్ ద్వారా భార్యకు తాను ఉరేసుకుని చనిపోతున్నానని సమాచారం పంపాడు. భార్య వాట్సాప్ ఓపెన్ చేయలేదు. భాస్కర్ గాజులపల్లికి చెందిన బాబుకు కూడా వాట్సాప్‌లో అన్న నన్ను క్షమించు అని సమాచారం పంపించాడు. దీంతో కుటుంబ సభ్యులు భాస్కర్ కోసం తన పొలం వద్దకు వెళ్లి చూడగా మామిడి చెట్టుకు లబ్బరు తాడుతో ఉరేసుకుని కనిపించాడు. అప్పటికే మృతిచెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి

- కొండపోచమ్మ కాలువ పనుల్లో జరిగిన ప్రమాదం


అంజిబాబు మృతదేహం

రాయపోల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ కాలువ పనుల్లో చోటుచేసుకున్న విద్యుదాఘాతంతో వలస కూలీ మృతిచెందిన సంఘటన సోమవారం రాయపోల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. బాధిత కుంటుంబసభ్యులు, రాయపోల్ ఎస్‌హెచ్ఓ కృష్ణంరాజు కథనం ప్రకారం.. కొండపోచమ్మ సాగర్ ద్వారా రామాయంపేటకు వెళ్లే ప్రధాన కాలువ నుంచి గజ్వేల్ మండలం బయ్యారానికి పిల్ల కాలువ పనులు చేపట్టగా, ప్రస్తుతం రాయపోల్ ముంగీస్‌పల్లి శివారులో కొనసాగుతున్నాయి. ఈ కాలువ పనుల కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు కార్మికులు వచ్చారు. గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన ఈర్ల అంజిబాబు(19) మూడు నెలల క్రితం పనుల్లో చేరాడు. సోమవారం ముంగీస్‌పల్లి సమీపంలో కాలువ వద్ద కాంక్రీట్‌ను ఖాళీ చేసేందుకు వాహనాన్ని పైకిలేపడంతో విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో వాహనం వద్ద పనుల్లో ఉన్న అంజిబాబు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. ఆయనను గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అంజిబాబు సోదరుడు ఈర్ల కోటి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


నితీశ్ మృతదేహం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి చనిపోయిందని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకున్నది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంతూరి నితీశ్(25) తండ్రి చనిపోవడంతో తల్లి, తన చెల్లెలుతో కలిసి పొన్నాల పరిధిలోని టీహెచ్‌ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మృతుడు టైల్స్‌పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కులాలు వేరు కావడంతో పెళ్లికి అంగీరించడంతో ప్రేమించిన అమ్మాయి పురుగులమందు తాగి జూలైలో చనిపోయింది. ఆమె బంధువులు నితీశ్‌పై ఫిర్యాదు చేశారు. అతడిపై కేసు నమోదై జైలుకు వెళ్లొచ్చాడు. తను ప్రేమించిన అమ్మాయి చనిపోవడం, తనపై కేసు కావడంతో మనస్తాపానికి గురైన నితీశ్ తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తల్లి మంతూరి పద్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి


రాథోడ్‌తేజ్‌బాయ్ మృతదేహం

నాగల్‌గిద్ద, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కిషన్ నాయక్ తండాలో సోమవారం చోటు చేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రాథోడ్‌తేజ్‌బాయ్(40) మధ్యాహ్నం ఇంట్లో ఉండగా పాము కాటు వేసింది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. తేజ్‌బాయ్‌కి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాళ్లకు పని చెబితేనే.. క్లాసుకు..


ఉప్పరపల్లి నుంచి దౌల్తాబాద్‌కు కాలినడకన వస్తున్న విద్యార్థులు

గువ్వలేగి, ఉప్పరపల్లి, లింగాయిపల్లి తండా, గొడుగుపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కరువు

నడిచి వెళ్తున్న విద్యార్థులు
ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరం

దౌల్తాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాలవి.. ఆ పల్లెల నుంచి ఏ పని కోసమైనా మండల కేంద్రమైన దౌల్తాబాద్‌కు వెళ్లాల్సిందే. ఇక్కడ సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, వలస కార్మికులే అధికం. వారి పిల్లలు చదువుకోవాలంటే ఐదారు కిలోమీటర్లు వెళ్లాల్సిందే. బస్సు సౌకర్యం లేక పిల్లలకు కాలినడక దిక్కుగా మారింది. గ్రామస్థులు ఏదైనా పని నిమిత్తం వెళ్లాలంటే ఆటోలు నిండేవరకు ఆగాల్సిందే. కనీసం దారైన సరిగ్గా ఉంటుందా అంటే అదీ మట్టి రోడ్డే. గువ్వలేగి, ఉప్పరపల్లి, లింగాయిపల్లి తండా, గొడుగుపల్లి గ్రామాల వారికి ఏళ్లుగా ఈ నరకయాతన తప్పడం లేదు.

బస్సు సౌకర్యం లేక చదువుకు స్వస్తి

లింగాయిపల్లి తండాలోని విద్యార్థులు చదువుకునేందుకు దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందూప్రియల్, జడ్పీ పాఠశాలకు వెళ్లాలంటే 3 కిలోమీటర్లు నడవాలి. లింగాయిపల్లి తండా నుంచి దాదాపు 9 కిలోమీటర్ల దూరంలో ఉండే దౌల్తాబాద్‌లోని మోడల్ స్కూల్‌కు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే అనేక అవస్థలు ఎదుర్కోవాల్సిందే. బస్సు సౌకర్యం లేక తండాలో ముగ్గురు విద్యార్థులు చదువు మానేశారు. ఇక గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాల విద్యార్థులు దౌల్తాబాద్ మోడల్ పాఠశాల, జడ్పీ బాలుర, బాలిక పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకోవాలంటే 5 కిలోమీటర్ల కాలినడక నడవక తప్పదు. సరైనా రోడ్డు లేక బస్సు సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు 5,7 వతరగతి వరకు చదివి స్వస్తి పలుకుతున్నారు.

రోడ్డు లేక.. బస్సు రాక

గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాలకు సరైనా రోడ్డు మార్గం లేక గ్రామ ప్రజల అత్యవసర సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. దౌల్తాబాద్‌కు చేరుకునేందుకు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి చెరుకుంటున్నారు. ఉప్పరపల్లి ప్రజలు, విద్యార్థులు చెరువు కట్టపై కాలినడవన, వాహనాల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తుంది. గ్రామస్థులు ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది.


ఉప్పరల్లి నుంచి ఆటోలో వస్తున్న విద్యార్థులు

బస్సు రాదు.. మేము ఎట్లా చదువుకోవాలి



గువ్వలేగి గ్రామానికి రోడ్డు బాగాలేక బస్సు రాదు. ఈ తిప్పలు పడలేక చదువులు మానేస్తున్నారు. ఎండ, వాన, చలి ఏదొచ్చినా దౌల్తాబాద్‌కు నడవాల్సిందే. ప్రతీరోజు 6 కిలోమీటర్లు నడవడం తప్పదు. రావడానికి, పోవడానికి నరకయాతన పడుతున్నాం. మేము ఎట్లా చదువుకోవాలి. మా గ్రామానికి రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- కనకరాజు, గువ్వలేగి

బస్సు సౌకర్యం కల్పిస్తే పైచదువులు చదువుకుంటాం



లింగాయిపల్లి తండాకు బస్సు సౌకర్యం కలిపిస్తే పాఠశాలకు సమయానికి చేరుకుని శ్రద్ధగా చదువుకుంటాం. ఇందుప్రియాల్ జడ్పీ పాఠశాలకు 3 కిలోమీటర్లు నడుచుకుంటు వెళ్లాలి. అధికారులు స్పందించి మా తండాకు బస్సుసౌకర్యం కల్పిస్తే పైచదువులు చదువుకుంటాం.

-అరుణ్, 9వతరగతి, లింగాయిపల్లి

ప్రభుత్వం చొరవ చూపాలి



ఉప్పరపల్లి గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక.. బస్సు రావడం లేదు. చాలా మంది చదువులు మానేశారు. మేము ప్రతీరోజు దౌల్తాబాద్‌కు వెళ్లాలంటే 5 కిలోమీటర్లు నడవాల్సిందే. బస్సు సౌకర్యం లేక పాఠశాలలకు, కళాశాలలకు సమయానికి చేరుకోక ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేప్పే పాఠాలు మిస్సవుతున్నాం.

- యం.స్రవంతి, ఉప్పరపల్లి

కేంద్రమంత్రి అమిత్‌షా
రాజీనామా చేయాలి

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్


మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

జహీరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ డిమాండ్ చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంపై చర్చజరుగుతున్న క్రమంలో రాజ్యసభలో కేంద్రమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ అంబేద్కర్ జపం మానాలని చెప్పడం, వ్యంగ్యంగా మాట్లాడిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి పదవిలో కొనసాగడానికి అమిత్‌షా అర్హుడన్నారు. బీజేపీ, మోదీప్రభుత్వం పనితీరును ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అంబేద్కర్‌ను అగౌరవ పరచినందుకు జాతీయస్థాయిలో ఆందోళనలను చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, నియోజకవర్గాల్లో, జిల్లాకేంద్రాల్లో నిరసన తెలుపుతామన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటు బీజేపీ అగ్రనేతలు ఎన్నికల్లో చేసిన వ్యాఖ్యలతో ప్రజలు వారికి సరిపడ మెజార్టీని ఇవ్వలేరనే విషయాన్ని గుర్తుచేశారు. విభజించు, పాలించు అనే తరహాలో బీజేపీ పాలన కొనసాగుతుందన్నారు. నేడు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జరిగే ధర్నా, నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు నరేష్‌గౌడ్, మండల పార్టీల అధ్యక్షులు రామలింగారెడ్డి, నర్సింహారెడ్డి, హన్మంత్‌రావుపాటిల్, మక్సూద్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్జ్ బాధితులకు అధికంగా పరిహారం చెల్లించాలని కోర్టు ఉత్తర్వులు

నారాయణఖేడ్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్‌తో భూములను కోల్పోతున్న రైతులకు అధికంగా పరిహారం చెల్లించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ తెలిపారు. సోమవారం నిమ్జ్ ఏర్పాటులో బాగంగా భూములు కోల్పోతున్న రైతులతో కలిసి సంగారెడ్డిలోని కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ వల్లూరి క్రాంతికి కోర్టు ఉత్తర్వు ప్రతిని అందజేశారు. ఆయన వెంట జడ్పీ మాజీ కోఆప్షన్‌సభ్యుడు ఎంఏ.రషీద్‌మదీనా, నాయకులు హన్మంత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ.18 లక్షల విలువైన 24 తులాల బంగారం స్వాధీనం
- ఎస్పీ రూపేష్ వెల్లడి


మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం జన్నారం గ్రామానికి చెందిన ముద్దంగి భీమేష్(25) లేబర్‌గా పనిచేస్తూ హైదరాబాద్ నాంపల్లిలో నివాసముంటున్నాడు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో తాళం వేసి ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని రాత్రి చోరీలకు పాల్పడేవాడు. అమీన్‌పూర్ బీఎస్ఆర్ కాలనీలో ఆదివారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.18 లక్షల విలువైన 24 తులాల బంగారు ఆభరణాలు, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై మొత్తం 41 దొంగతనం కేసులు ఉన్నాయి. భీమేష్‌పై పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ రూపేష్ వెల్లడించారు. ఇళ్లల్లో, సంస్థల్లో సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాల్లోని ఏ ప్రాంతంలోనైనా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్ సీఐ సదా నాగరాజు తదితరులు ఉన్నారు.

గుమ్మడిదల మున్సిపాలిటీ ఏర్పాటుపై ఆగ్రహం

రైతుల ధర్నా.. స్తంభించిన ట్రాఫిక్


ధర్నా నిర్వహించి అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గుమ్మడిదల డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ వద్దు గ్రామపంచాయతీయే ముద్దు అంటూ గుమ్మడిదల ప్రాంత రైతులు నినదించారు. వ్యవసాయ ప్రాంతంగా ఉన్న గ్రామాన్ని రాజకీయాల కోసం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలతో పాటు గుమ్మడిదలను పంచాయతీగానే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాలానగర్ - నర్సాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా రైతు సంఘాల సమైక్య ఉపాధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి, సీజేఆర్ ట్రస్టు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అమ్మగారి వేణుగోపాల్‌రెడ్డి, ఉదయ్ కుమార్ మద్దతు పలికారు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అనంతరం పలువురు రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంగా ఉన్న గుమ్మడిదల మండలాన్ని మున్సిపాలిటీగా మార్చడం అన్యాయమని అన్నారు. పెరిగే టాక్స్‌లను ప్రజలు భరించలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యథావిధిగా పంచాయతీగా కొనసాగే విధంగా ప్రతీ రాజకీయ పార్టీ నాయకుడు మద్దతు తెలపాలని కోరారు. తహసీల్దార్ గంగాభవానీ, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి హామీతో ధర్నా విరమించారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఉద్యాన పంటలది కీలకపాత్ర

ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న రాజిరెడ్డి, ఆర్‌కె.మథూర్

ములుగు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 5.23 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఉద్యాన పంటలు కీలకపాత్ర పోషిస్తుందని ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ 10వ వ్యవస్థాపక దినోత్సవం, జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రిసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కె. మథూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దండ రాజిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ స్థూల విలువ ఉత్పత్తికి (జీవీవో) 30శాతం తోడ్పడుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ద్వారా కొత్త పంట రకాలను పరిచయం చేశామని, తెగుళ్లను నియంత్రించామన్నారు. ఈ సందర్భంగా మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ద ఇండియా 2024 గ్రహీతలు లోకసాని పద్మారెడ్డి, వేముల వెంకటేశ్వర్లను సత్కరించారు. పదేళ్ల పురోగతిని బులిటన్ రూపంలో విడుదలచేశారు.

విద్యార్థుల పొలంబాట




అక్షరాలు నేర్చుకునే దశలో ఆ స్కూలు పిల్లలు అన్నదాతల అవతారమెత్తారు. పాఠాలు పక్కన పెట్టి పొలం బాట పట్టారు. బాల్యంలోనే రైతు బాధలు తెలియజెప్పేలా టీచర్లు వింత ఆలోచనకు తెరలేపారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి నగరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను పొలానికి తీసుకెళ్లి నాట్లు వేయించారు. రైతులు పండించే పంటలపై అవగాహన కల్పించారు.

- రామాయంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)



తగ్గిన దిగుబడి.. పెరిగిన పెట్టుబడి

ధర లేక ఉల్లి రైతుల సతమతం

నారాయణఖేడ్, డిసెంబరు 23: పెట్టుబడి పెరిగి, దిగుబడి తగ్గి గిట్టుబాటు ధర రాక అప్పుల పాలు కావాల్సి వస్తుందని ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని అబ్బెంద, జగన్నాథ్‌పూర్, బాణాపూర్, పిప్రి, పగిడిపల్లి, రుద్రార్, మనూరు మండలం రాణాపూర్, తుమ్నూర్, తదితర గ్రామాలు ఉల్లిసాగుకు ప్రసిద్ధి. గతేడాది ఉల్లిపంటకు మార్కెట్‌లో మంచి ధర లభించడంతో ఈ సీజన్‌లో అధికంగా సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక, దిగుబడి సగానికి పడి పోయింది.

ప్రస్తుతం ఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపు 400 చిలుకు ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. సాధారణంగా ఒక ఎకరాకు 150 క్వింటాళ్ల వరకు ఉల్లి పంట దిగుబడి వచ్చేది. ఈ సంవత్సరం 50 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదని, రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటకు పెట్టుబడి దాదాపుగా రూ.40 వేల వరకు ఖర్చయిందని, పంట చేతికి అందాక ఉల్లిని తీయడానికి, మార్కెట్‌కు తరలించడానికి మరో రూ.10 వేల ఖర్చు తప్పడం లేదని తెలిపారు. ఇటీవలి వరకు హోల్‌సేల్‌గా క్వింటాల్‌కురూ.4 వేల నుంచి 5 వేల వరకు ఉండేది. పంట చేతికందే సమయానికి ఒక్కసారిగా ధర పడిపోయింది. ఇతర దేశాలకు ఎగుమతిని నిషేధించడంతో పడిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉల్లినాణ్యతను బట్టి క్వింటాల్‌కు హోల్‌సేల్‌గా రూ.2 వేల నుంచి 3 వేల వరకు మాత్రమే లభిస్తుందని వాపోతున్నారు. పండించిన పంటను నిల్వ ఉంచుకుందామంటే ఎలాంటి వసతులు లేవని, ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజీ సౌకర్యం కల్పిస్తే, అక్కడ నిల్వ ఉంచుకునే అవకాశం ఉంటుందని రైతులు వేడుకుంటున్నారు.

గిట్టుబాటు ధర లేదు



కష్టపడి ఉల్లిపంటను పండించిన గిట్టుబాటు ధర లభించడం లేదు. అర ఎకరంలో ఉల్లి పంటను సాగు చేశా. గతంలో 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 20 క్వింటాళ్లు కూడా రావడం లేదు. తగ్గిన ధరలకు విక్రయిస్తే పెట్టిన పెట్టుబడులు కూడా దక్కవు. ధర పెరిగాక విక్రయించుకునే విధంగా ప్రభుత్వంకోల్డ్‌స్టోరేజీ సౌకర్యాన్ని కల్పిస్తే బాగుంటుంది.

- రమేష్, రైతు,పిప్రి

రోడ్డు ప్రమాదంలో
కూలీ మృతి

రామచంద్రాపురం, డిసెంబర్ 23 : రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) సర్వీసు రోడ్డుపై ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. కొల్లూరులో నివాసముంటున్న షేక్ అక్బర్ (38) ఆదివారం రాత్రి బైక్‌పై కొల్లూరు బయలు దేరాడు. మార్గమధ్యంలో బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రగాయాలైన అక్బర్ అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని సీఐ పేర్కొన్నారు. భార్య షేక్ అమీనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

3 ముక్కలు పాలనలు

- గ్రేటర్‌లోకి బొల్లారం
- మున్సిపాలిటీగా గడ్డపోతారం
- 9 పంచాయతీలతో మండల పరిషత్

జిన్నారం, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలను అప్‌గ్రేడ్ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిన్నారం మండలంలో మూడు విధాలుగా స్థానిక సంస్థల పాలనా వ్యవహారాలు సాగనున్నాయి. మున్సిపాలిటీగా ఉన్న బొల్లారం గ్రేటర్ డివిజన్‌గా మారనుండగా, గ్రామ పంచాయతీగా ఉన్న గడ్డపోతారంను నూతన మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 9 పంచాయతీలతోనే ఎంపీపీ పరిధి సాగనుండగా కొత్త ఏడాదిలో పాలనా వ్యవహారాల్లో మార్పు రానున్నది. పారిశ్రామిక, పట్టణ, గ్రామీణ ప్రాంతాల కలయికగా ఉన్న మండలంలో నూతన పాలనా విధానం అమలు కానున్నది.

ఒకటి లేదా రెండు డివిజన్లుగా..

నగరానికి చేరువలో ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న బొల్లారం ఇక నగర పాలనలో చేరనున్నది. వచ్చే నెల జనవరి 25తో ప్రస్తుత మున్సిపల్ పాలక వర్గం పదవీ కాలనం ముగిసిన వెంటనే బొల్లారం గ్రేటర్ పరిధిలో చేరుతుంది. ఇక్కడ సుమారు 60 వేల జనాభా, 32 వేల వరకు ఓటర్లు ఉండగా ఒకటి లేదా రెండు డివిజన్‌లు ఏర్పాటు జరిగే అవకాశం ఉన్నది. దీంతో స్థానిక పాలన జీహెచ్ఎంసీ ఆధీనంలో జరుగనున్నది. ఇక పారిశ్రామిక మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న గడ్డపోతారంను ప్రభుత్వం నూతన మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయనున్నది. ఈ మేరకు శాసన సభలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన కూడా చేశారు. కొత్త మున్సిపాలిటీ గడ్డపోతారం పరిధిలో కాజీపల్లి, మాదారం, నల్తూరు, లక్ష్మీపతిగూడెం, వావిలాల పంచాయతీలు విలీనం కానున్నాయి. దీంతో మండల పరిషత్ నుంచి విడిగా మారిన ఈ పంచాయతీలలో నూతన మున్సిపాలిటీ కిందనే స్థానిక పాలన సాగుతుంది.

9 పంచాయతీలకే ఎంపీపీ పరిమితం..

గతంలో జిల్లాలోనే అతి పెద్ద మండలంగా కొనసాగిన జిన్నారం మండలం నేడు 9 పంచాయతీలతో ఇకపై పాలన సాగనున్నది. గతంలో 23 పంచాయతీలు, 27 మంది ఎంపీటీసీలు ఉండగా ఐదేళ్ల క్రితం బొల్లారం మున్సిపాలిటీ, గుమ్మడిదల నూతన మండలం కావటంతో ఎంపీటీసీల సంఖ్య 8 మందికి తగ్గింది. ప్రస్తుతం 9 జీపీలే ఉండగా మరో మూడు ఎంపీటీసీ స్థానాలు తగ్గే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక జిన్నారం మండలంలో మంగంపేట, ఊట్ల, సోలక్‌పల్లి, కొడకంచి, జంగంపేట, అండూరు, రాళ్లకత్వ, శివానగర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దీంతో కొత్త సంవత్సరం 2025 నుంచి మండలంలో జీహెచ్ఎంసీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ(ఎంపీపీ)ల పరిధిలో స్థానిక పాలనా వ్యవహారాలు జరుగనున్నాయి.


బొల్లారం మున్సిపాలిటీ ముఖచిత్రం

ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. గత పాలకులు పదేళ్లుగా మెదక్ అభివృద్ధిని పట్టించుకోలేదని, కాంగ్రెస్ సర్కార్ ఏడాది కాలంలోనే రూ.30 కోట్లతో మెదక్ చర్చిని అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, మైనార్టీ సంక్షేమాధికారి జమలా నాయక్, తహశీల్దార్ లక్ష్మణ్‌బాబు, నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పాపన్నపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడుపాయల పర్యాటన నేపథ్యంలో సోమవారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ బాబు, జాయింట్ కమిషనర్ రామక్రిష్ణ, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ నగేష్ ఏర్పాట్లను పరిశీలించారు. కొల్చారం మండలపరిధిలోని ఏడుపాయల శివారులో మంజీరా నది ఒడ్డున హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. అంతకుముందు కమిషనర్ శ్రీధర్ బాబు ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్నారు.

సీఎం రాకతో రుపురేఖలు మారుతాయి..

నర్సాపూర్,డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో జిల్లాకు నిధులు కేటాయిస్తారని, దీంతో రూపురేఖలు మారడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి స్వగృహంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.


మెదక్ అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

కార్పొరేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబరు, 23(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కిడ్స్ సెంటర్లకు దీటుగా అగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరులో ఐసీడీఎస్, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ ఉపాధ్యాయుల విద్యాతరంగిణి టీచర్స్ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిశు విద్యార్థులకు ప్రాథమిక నడవడిక, విద్యాభ్యాసం నేర్పడంతో పాటు మహిళలు, బాలికలకు పౌష్టికాహారాన్ని అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఇస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, ఐసీడీఎస్ జిల్లా అధికారి లలితకుమారి, సీడీపీవోలు జైరాంనాయక్, చంద్రకళ, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు. అలాగే డివిజన్‌లోని శాంతినగర్, శ్రీనగర్‌కాలనీలలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కార్పొరేటర్, అధికారులతో కలిసి పర్యటించారు. ఓపెన్ డ్రైనేజీ సమస్యను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తేగా, త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సమయపాలన పాటించాలి

- సీడీపీవో భార్గవి

శివ్వంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు సమయపాలనను పాటించాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీవో హేమ భార్గవి అన్నారు. సోమవారం శివ్వంపేట రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పిల్లలు, తల్లుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు, జిల్లా పోషన్ అభియాన్ కోఆర్డినేటర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హద్దురాళ్ల ఏర్పాటుపై ఆగ్రహం

- అధికారులతో ప్రజల వాగ్వాదం
- ఐడీఎస్ఎంటీ వద్ద ఉద్రిక్తత


ఐడీఎస్ఎంటీ కాలనీ వద్ద అధికారులతో వాగ్వాదానికి దిగిన లబ్ధిదారులు

జహీరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డుకాలనీ సమీపంలో 1982లో సర్వే నంబర్ 156, 157, 158, 160,161 లలో ఐడీఎస్ఎంటీ (ఇంటిగ్రెటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ అండ్ మీడియం టౌన్‌షిప్)ఏర్పాటు చేశారు. ఇందులోని 101 ఎకరాల్లో 1,294 ప్లాట్లు చేశారు. అందులో 1,115 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధం చేసి 1987 నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభించి 2009 వరకు ఏటా కొన్ని చొప్పున నామినల్ ఫీజుతో మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే 158 సర్వేనంబర్‌లో తమకు కొంతభూమి వస్తుందని పట్టణానికి చెందిన కొందరు ప్రైవేటు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు భద్రతతో ప్రైవేటు వ్యక్తులు సోమవారం ఆ స్థలంలో హద్దురాళ్లను ఏర్పాటు చేసేందుకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న లబ్ధిదారులు అక్కడికి చేరుకుని వారిని అడ్డుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, టీపీవో నరేష్ అక్కడికి చేరుకుని కోర్టు ఆదేశాలను పరిశీలించగా, స్థలంలో ప్రస్తుతం ఏ పరిస్థితి ఉందని, కట్టడాలేమైనా ఉన్నాయా.. పరిశీలించి నివేదికను ఇవ్వాలని కోర్టు చెప్పిందని, హద్దురాళ్లను పాతడానికి వీలులేదని వారు స్పష్టం చేశారు. కాగా, ఐడీఎస్ఎంటీ ప్లాట్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ రాములునేత జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్‌కు వినతిపత్రం అందజేశారు.

'ఉపాధి'లో అక్రమాలు


సామాజిక తనిఖీ చేపడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ రంగాచారి

టేక్మాల్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులలో అక్రమాలు వెలుగు చూసాయి. మండల కేంద్రమైన టేక్మాల్‌లోని రైతువేదికలో సోమవారం 2023-24 ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 29 గ్రామ పంచాయతీలలో మొత్తం రూ.3.75కోట్ల పనులు చేపట్టగా, ఎల్లుపేట, తంపులూర్, వెంకటాపూర్ తదితర గ్రామ పంచాయతీలలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు రూ. 5,25,821 రికవరీకి ఆదేశించినట్లు డీఆర్‌డీఏ ఏపీడీ రంగాచారి తెలిపారు. అక్రమాలకు పాల్పడిన ఎఫ్ఏలకు రూ.47వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, సీనియర్ నాణ్యత పరిశీలకురాలు జ్యోతి, హెచ్ఆర్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీవో విఠల్, ఏపీవో పౌలు, పీఆర్ఏఈ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గౌడలు ఐక్యంగా ముందుకు సాగాలి

- రాష్ట్ర సెక్రటరీ జనరల్ రాగుల సిద్దిరాముల గౌడ్

చేగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గౌడలు రాజకీయాలకు అతీతంగా ఐక్యతగా ముందుకు సాగాలని గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ రాష్ట్ర సెక్రటరీ జనరల్ రాగుల సిద్దిరాముల గౌడ్ అన్నారు. చేగుంట మండలం కర్నాల్ పల్లి రేణుక అలయం అవరణలో సోమవారం రాష్ట్ర ముఖ్యుల సమావేశానికి అయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాల్‌రాజుగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం నర్సింలుగౌడ్, రాష్ట్ర కార్యదర్శి కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మెదక్ జిల్లా మహిళా గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కొయ్యల నాగదేవతగౌడ్ ఎన్నికయ్యారు.

ఖేడ్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి

నారాయణఖేడ్, డిసెంబరు 23: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ ఛైర్మన్ దారం శంకర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణపనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శెట్టిశంకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల్లో చైతన్యం అవసరం

- జడ్జీ విజయకుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయకుమార్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల్లో చైతన్యం అవసరమని వినియోగదారుల కమిషన్ సభ్యుడు, జడ్జీ విజయకుమార్ అన్నారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారులు-రక్షణ చట్టాలు అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు అమ్మకం నుంచి మోసాలకు గురైనప్పుడు జాతీయ వినియోగదారుల కమిషన్ సాయం పొందవచ్చన్నారు. యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, తూనికలు కొలతల శాఖ నిజామాబాద్ రేంజ్ కంట్రోలర్ విజయసారథి, సంగారెడ్డి జిల్లా అధికారి అనీల్‌కుమార్ మాట్లాడుతూ వస్తువులు కొన్నప్పుడు తూనికలు కొలతలు సరిచూసుకోవాలని, లోపాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించి న్యాయాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ


పూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

మనోహరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాళ్లకల్ గ్రామంలోని కేఎల్ఆర్ వెంచర్ గ్రీన్ హట్‌లో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్ మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట్టాల యాదగిరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ మెట్టు బాలకృష్ణరెడ్డి, మండల ముదిరాజ్ అధ్యక్షుడు నరేష్, కాళిదాసు, ఇతర సర్పంచ్‌లు చంద్రశేఖర్, నాగభూషణం, భిక్షపతి, ఆనంద్, నరేన్, పురం గిరిధర్, పురం రవి, కృష్ణ, వేంకటేష్, నాగరాజు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

పుల్‌కల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రైతు దినోత్సవాన్ని మండల కేంద్రమైన పుల్కల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం-లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ సౌజన్యంతో పీఏసీఎస్ ఛైర్మన్ అనంతరావు కులకర్ణి రైతులను శాలువాలతో సన్మానించారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ కిష్టయ్య, జోన్ ఛైర్మన్ లయన్ మంగళపర్తి వెంకటేశం, సీఈవో నాగయ్య, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

28న దుకాణాల వేలం

తూప్రాన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్దగల మున్సిపాల్ దుకాణాలకు ఈ నెల 28న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్దగల 1, 3, 4, 5 దుకాణాల వేలంలో పాల్గొనేందుకు ఈ నెల 27న సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను సమర్పించాలని కోరారు. రూ. లక్ష డిపాజిట్‌ను డీడీ తీసి అందజేయాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు వినతి

జిన్నారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాజీపల్లి గండి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి తగ్గించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు నాయకుడు రమాకాంత్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానిక గండి చెరువులో పరిశ్రమల కాలుష్య జలాలు చేరి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని తెలిపారు. చెరువు నుంచి నీటిని దిగువకు విడుదల చేయకపోవడంతో ఎఫ్‌టీఎల్ పరిధిలో పంటలు మునిగి వ్యవసాయం చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధి తగ్గించి, చెరువులోకి పరిశ్రమల కాలుష్య జలాలు చేరకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఘనంగా అనఘాదత్త వ్రత మహోత్సవం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో అనఘాదత్త వ్రత మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 215 గ్రామాల నుంచి వచ్చిన 2400 మంది మహిళలు వ్రత మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డా.మహేశ్వర శర్మసిద్ధాంతి ఆధ్వర్యంలో వ్రత మహోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : వాసవి క్లబ్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా పుల్లూరి ప్రకాశ్ నియమితులయ్యారు. తమిళనాడులోని మధురైలో జరిగిన వార్షిక సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుళ్ల రామకృష్ణ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పుల్లూరు ప్రకాశ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అంతర్జాతీయ నాయకులు గంప శ్రీనివాస్, చంద్రాశ్రీధర్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

శివాలయం భూములు రక్షించాలని ఆందోళన

జిన్నారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో నిర్మిస్తున్న శివాలయం దేవాలయ భూములు రక్షించాలని వివిధ పార్టీల నాయకులు, స్థానికులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. శివాలయం స్థలంలో ప్రైవేటు వ్యక్తులు కబ్జాలకు పాల్పడుతున్నారని, సర్వే కోసం గతంలో వినతి పత్రాలు ఇచ్చినా.. రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. వెంటనే దేవాలయ భూమిని సర్వే చేయాలని తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. అలాగే శివానగర్‌లో తోళ్ల పరిశ్రమ కోసం కేటాయించిన స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నాయని సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 20ఏళ్ల కిందట తోళ్ల పరిశ్రమల ఏర్పాటు కోసం నాటి ప్రభుత్వం 13ఎకరాలను కేటాయించగా, రెండుమూడు ఖర్కానాలు మాత్రమే ఏర్పాటు చేశారని తెలిపారు. మిగతా స్థలం ఆక్రమణకు గురవతున్నదని, రక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, సుధాకర్, వెంకటేశంగౌడ్, యాదిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతున్నది. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలని వారు కోరారు.

- జోగిపేట, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షకు అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మద్దతు ప్రకటించారు. కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న దీక్షలో సోమవారం ఆయన కూర్చుని సంఘీభావం తెలిపారు.

బెల్టు షాపులు తొలగించాలని ధర్నా

జోగిపేట, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): అందోలు మండలంలో విచ్చల విడిగా కొనసాగుతున్న బెల్టు షాపులను మూసి వేయాలంటూ మాలమహానాడు ధ్వర్యంలో సోమవారం జోగిపేటలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు అందోలు మల్లేశం, వరప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం, బెల్టు షాపులు తొలగించాలంటూ ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెండగోపాల్, సంగం మహేశ్, సటికె రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ సభ్యులతో గొడవపడి..


సిద్దిరాములు (ఫైల్)

చిన్నశంకరంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపానికి గురైె వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చింతల సిద్దిరాములు(45) కొన్ని రోజులుగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులు తరచూ గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నడుం నొప్పి భరించలేక..

చేగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నడుం నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిక్కుడుస్వామి(44) కొన్ని నెలల నుంచి నడుము నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ ఉక్కుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

100 కిలోల ప్లాస్టిక్ కవర్లు సీజ్

నారాయణఖేడ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో సోమవారం శానిటేషన్ అధికారి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు విక్రయిస్తున్న దుకాణాల యజమానులకు జరిమానా విధించి రసీదులను అందజేశారు. మొత్తం 100 కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

కోహీర్, డిసెంబరు 23 : (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రమైన కోహీర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఛైర్మన్ మల్కాపురం శివకుమార్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉచిత పశువైద్య శిబిరం

కంగ్టి, డిసెంబరు 23: రైతులు తమ పశువులలో ఎద లక్షణాలను గుర్తించి కృత్రిమ గర్భాధారణ టీకాలు వేయిస్తే మేలు జాతి పశు సంపద వృద్ధిచెందుతుందని గోపాల మిత్ర సూపర్ వైజర్ తుక్కారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగన్‌పల్లిలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాఠశాల స్కూల్ యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్ ఫాదర్ ఇన్నారెడ్డి, జోసెఫ్, విద్యా సంస్థల అధినేత పాపులమ్మసలోమోన్‌రెడ్డిలు హాజరై క్రిస్మస్ క్రిబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధర్మాన్ని అనుసరించి నడుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్రీస్తుజన్మ వృత్తాంతాన్ని నాటకం ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్, అకాడమిక్ డైరెక్టర్ అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం


విద్యార్థి తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యశ్వంతరావుపేటకు చెందిన బ్యాగరి వంశీ(14) మంగళపర్తి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 19న పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా కారు ఢీ కొనడంతో వంశీకి తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంగళపర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వంశీ తండ్రి శ్రీనివాసుకు రూ. 1,03,000 ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

చిన్నశంకరంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం చందంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సెక్రటరీగా పని చేసిన పటేల్ విజయ్ కుమార్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ సత్యనారాయణ, తోటి సిబ్బంది మృతుడి భార్య మహేశ్వరికి రూ.2,39608 విలువగల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శివకుమార్, సొసైటీ డైరెక్టర్లు పోచగౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

జోగిపేట, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు, మాజీ వార్డు సభ్యుడు పట్లోల్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.మాణయ్య, ఉపాధ్యాయులు ఆచం లక్ష్మణ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

రామచంద్రాపురం, డిసెంబరు 23 : కొల్లూరు పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే జరిగే నష్టాల గురించి ప్రయాణికులకు వివరిస్తూ హెచ్చరించారు.